
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
ఆదివారం 3 ఆగస్టు 2025
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 34.0 కనిష్ఠం : 24.0



సంక్షేమం కోసం.. రూ.లక్ష కోట్లు ఖర్చు



కొల్లాపూర్ సభలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ



సభలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- కొల్లాపూర్‌లోనే రాజకీయ ఓనమాలు దిద్దుకున్నా
- ఈ ప్రాంతంతో ప్రత్యేక అనుబంధం ఉంది
- ప్రపంచాన్ని ఆకర్షించేలా తెలంగాణ టూరిజం అభివృద్ధికి కృషి
- రూ. 65.67 కోట్ల అంచనా వ్యయంతో 7 విద్యుత్ ఉప కేంద్రాలకు శంకుస్థాపన
- లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల హక్కు పత్రాలు పంపిణీ

కొల్లాపూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ప్రజల సంక్షేమం కోసం లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేశామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శనివారం నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలో సురభి కోట ముందు పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభివృద్ధి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రాలకు శంకుస్థాపన చేశారు. రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పంపిణీ, అర్హులైన 4వేల మంది లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డుల అందజేశారు. 3,500 మందికి ఇందిరమ్మ ఇళ్ల హక్కు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్‌అలీ ఫరూఖీ, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి రూ.65.67 కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటు చేయనున్న 7 విద్యుత్ ఉప కేంద్రాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బంగ్లా ముందు ఏర్పాటు చేసిన సభలో ఉప ముఖ్యమంత్రి మాట్లాడారు. ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలు వారి సమస్యలను నాయకులకు స్వేచ్ఛగా చెప్పుకుంటున్నారని తెలిపారు. ప్రజల ఆలోచనలే మా పార్టీ ఎజెండాగా పని చేస్తున్నామని ఆయన తెలిపారు. రాయలసీమ ఎత్తిపోతల పై ప్రాంతంలో తెలంగాణ భూ భాగంలో ఒక డ్యామ్ కడితే పెద్ద ఎత్తున కృష్ణానది నీటిని తీసుకునే అవకాశం ఉన్నా నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు ఆలోచన చేయలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని వేగవంతం చేశామని తెలిపారు. పర్యాటక రంగంలో తెలంగాణ ప్రపంచాన్ని ఆకర్షించేలా మంత్రి జూపల్లి కృష్ణారావు కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆరోగ్యశ్రీ వైద్య పరిమితిని రూ.10 లక్షలకు పెంచామని తెలిపారు. ఇప్పటి వరకు మహిళలు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించిన ఖర్చు రూ.6,680 కోట్లను ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించిందని అన్నారు. ప్రతీ నియోజకవర్గంలో 3,500 ఇళ్ల చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇళ్లు మొదటి దశలో నిర్మించేందుకు రూ.22,500 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

కొల్లాపూర్‌తో ప్రత్యేక అనుబంధం

తమ సోదరుడు దివంగత మల్లు అనంత రాములు 1980లో నాగర్‌కర్నూల్ ఎంపీగా పోటీ చేసిన సమయంలో తాను విద్యార్థిగా ఉన్నానని తెలిపారు. ఆ సమయంలో తనను కొల్లాపూర్ ఇన్‌చార్జిగా నియమించారని, ఆనాడే తాను రాజకీయ ఓనమాలు నేర్చుకున్నానని తెలిపారు. ఈ ప్రాంతంలో ఉన్న 98 జీవో బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రతిపాదించిన గ్రామాలలో ఎస్‌బీఐ బ్యాంకుల పునరుద్ధరణకు కృషి చేస్తామన్నారు. పాలమూరు ముద్దు బిడ్డ రాష్ట్ర ముఖ్య మంత్రిగా ఉండగా కొల్లాపూర్ రాజకీయ జీవితం ప్రారంభించిన తాను డిప్యూటీ సీఎంగా ఉన్నానని తెలిపారు. 'కోన్ పూచ్‌తే.. కొల్లాపూర్ నుంచి సబ్‌పూచ్‌తే కొల్లాపూర్ స్థాయికి ఎదిగిందన్నారు. నిత్యం ప్రజల కోసమే ఆలోచన చేస్తున్న వ్యక్తి జూపల్లి కృష్ణారావు ఈ ప్రాంత ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నారని, పిలిస్తే పలికే వ్యక్తిగా ఎంపీగా మల్లు రవిని ఈ ప్రాంత ప్రజలు గెలిపించి చట్టసభలకు పంపించారని గుర్తు చేశారు. కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రంలో అడ్వాన్స్‌డ్ ఐటీఐ కళాశాల ప్రారంభించేందుకు తగు నిర్ణయం తీసుకు నేలా ప్రయత్నం చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

వెల్టూరు, చిన్నమారూర్ మధ్య కృష్ణానదిపై డ్యాం నిర్మించాలి

మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పోతిరెడ్డిపాడు కాల్వ ద్వారా కృష్ణా జలాలను ఇప్పటికే భారీగా తరలించుకుపోతున్నదని అన్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ విస్తరణతో మన ప్రాంతానికి తీవ్ర అన్యాయం జరగనుందని, శ్రీశైలం రిజర్వాయర్‌లోని నీళ్లు, రెండు మూడు నెలల్లోనే ఖాళీ అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంత నీటి సమస్య తీరాలంటే వెల్టూరు, చిన్నమారూర్ మధ్య కృష్ణానదిపై ఒక డ్యాం నిర్మించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఒక ఎకరం కూడా

(మిగతా 6లో..)

కందనూలు జడ్పీ పీఠంపై బీఆర్ఎస్ కన్ను

- రిజర్వేషన్లు, ఎన్నికల నోటిఫికేషన్ ఖరారు కాకుండానే ముందస్తు ప్రణాళిక
- జడ్పీ బరిలోకి దిగనున్న మాజీ ఎమ్మెల్యేలు

నాగర్‌కర్నూల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లా నాగర్‌కర్నూల్‌లో పాగా వేసేందుకు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) శతవిధాలా ప్రయత్నిస్తోంది. ఇందుకోసం రాబోయే మండల, జిల్లా పరిషత్ ఎన్నికలను వేదికగా ఎంచుకోవాలని భావిస్తోంది. ఈ మేరకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవెల్లి ఫామ్‌హౌజ్‌లో ప్రణాళికను రూపొందించారు. దీన్ని అమలు చేయాల్సిన బాధ్యతను వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావులకు అప్పగించారు. సీఎం నుంచి అనేక సవాళ్లు బీఆర్ఎస్‌కు ఎదురవుతున్న క్రమంలో ఆయన సొంత జిల్లాలోనే దెబ్బతీస్తే రాబోయే సాధారణ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తిరిగి అధికారంలోకి వచ్చే పరిస్థితులు షురూ అవుతాయని బీఆర్ఎస్ అధిష్ఠానం యోచిస్తున్నట్లు విశ్వసనీయమైన సమాచారం.

జిల్లా పరిషత్ బరిలో మాజీ ఎమ్మెల్యేలు?



జిల్లా పరిషత్ కార్యాలయం

నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ పీఠాన్ని కైవసం చేసుకొని సత్తా చాటాలనుకుంటున్న బీఆర్ఎస్ ఆ దిశగా పావులు కదుపుతోంది. ఇటీవల ఎర్రవెల్లి ఫామ్‌హౌజ్‌లో జిల్లా ముఖ్యులతో సమావేశం నిర్వహించిన కేసీఆర్ తన మనోగతాన్ని బయట పెట్టినట్లు సమాచారం. 20 మంది జడ్పీటీసీ సభ్యులున్న నాగర్‌కర్నూల్ జిల్లాలో గతంలో బీఆర్ఎస్ ఆ పీఠాన్ని దక్కించుకున్నది. ఆ సమయంలో కూడా అనేక నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. జడ్పీ చైర్మన్ ఎస్సీ జనరల్ రిజర్వ్ అయ్యింది. తెలకపల్లి జడ్పీటీసీ సభ్యురాలు పద్మావతి జడ్పీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించగా ముగ్గురు పిల్లలు ఉన్న కేసులో కోర్టు తీర్పు ఆమెకు వ్యతిరేకంగా రావడంతో పదవి నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. ఈ క్రమంలో జడ్చర్ల నియోజకవర్గం ఊర్కొండ నుంచి ప్రాతినిధ్యం వహించిన శాంతకుమారికి జడ్పీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించే అవకాశం దక్కింది. అప్పటికే ఆ పదవిని ఆశించిన ఎంపీ రాములు కుమారుడు భరత్‌కు అవకాశం ఇవ్వకపోవడం కారు పార్టీని కుదిపేసింది. చివరకు అప్పటి ఎంపీ రాములు, ఆయన కుమారుడు భరత్‌ప్రసాద్ బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరిన విషయం తెలి సిందే. ఆ తర్వాతి క్రమంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం బీఆర్ ఎస్‌ను వీడి అనేక మంది జడ్పీటీసీలు జడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ గూటికీ చేరారు. అవిశ్వాసాన్ని ప్రకటించి జడ్పీ చైర్మన్ శాంతకుమారిని తొలగించే అవకాశం ఉన్నా మరో ఎస్సీ జడ్పీటీసీ లేకపోవ డం కారణంగా శాంతకుమారి ఆమె పదవీ కాలాన్ని పూర్తి చేయగలిగారు. ఇదిలా ఉండగా చైర్మన్ రిజర్వేషన్‌ను బట్టి మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, జైపాల్ యాదవ్, గువ్వల బాలరాజు పోటీచేసే అవకాశం ఉంది.

కాంగ్రెస్ దారి ఎటు?

జిల్లా పరిషత్‌ను కైవసం చేసుకోవడానికి భారత రాష్ట్ర సమితి వ్యూహాత్మకంగా పావులు కదుపుతుండగా కాంగ్రెస్ పార్టీ ఇప్పటికీ ఓ నిర్ణయానికి రాలేదు. రిజర్వేషన్లు జిల్లా పరిషత్ చైర్మన్ పదవికి ఏ వర్గానికి అనుకూలంగా వస్తాయి, ఎవరిని ముందు వరుసలో ఉంచి ఎన్నికలను ఎదుర్కోవాలనే అంశంలో ఇతమిద్ధమైన నిర్ణయానికి రాకపోవడం పట్ల కాంగ్రెస్ పార్టీకి అనుకూలమైన అన్ని వర్గాల్లో అనిశ్చితి నెలకొన్నది. జడ్పీ చైర్మన్ పదవిని బీసీలకు రిజర్వ్ చేస్తే జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీ సింగ్, పెద్దకొత్తపల్లి మాజీ ఎంపీపీ ప్రతాప్‌గౌడ్‌ల పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. ఈ మేరకు ఇటీవల మాజీ జడ్పీటీసీలు, ఎంపీటీసీలతో డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ ఇటీవల సమావేశం మాత్రం నిర్వహించారు.

మత్స్య సంపద కోర్సులతో ఉద్యోగ అవకాశాలు

- ఎంసెట్ అర్హత ఆధారంగా సీట్ల కేటాయింపు
- పరిశోధనలు చేసేందుకు సౌకర్యవంతమైన వసతులతో కళాశాల ఏర్పాటు
- నాలుగేళ్ల పాటు జలసంవర్ధక విద్య
- రాష్ట్రంలోనే ఏకైక మత్స్య కళాశాల



పెబ్బేరులో మత్స్య కళాశాల భవనం

6

వ్యాపారం.. రోడ్డెక్కుతోంది!

- ప్రధాన రహదారికి అనుసరించి దుకాణాల ఏర్పాటు
- మన్ననూర్ నుంచి శ్రీశైలం వరకు వాహనదారులకు ఇబ్బందులు
- ఇరుకుగా మారుతున్న శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారి

6



బ్రహ్మగిరిలో రోడ్డుకు ఆనుకొని దుకాణాలు ఏర్పాటు చేయడంతో నిలిచిపోయిన వాహనాలు

ప్రీ ప్రైమరీ టీచర్స్‌గా తీసుకోవాలి

ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి సీతక్కను కలిసిన అంగన్‌వాడీ టీచర్లు

7



మంత్రి సీతక్కకు వినతి ఇస్తున్న అంగన్‌వాడీలు

వరుణా కరుణించవా..

- మారమునగాల వద్ద కృష్ణానదిలో ఆంజనేయస్వామికి జలాభిషేకం
- 50 జతల కాడెద్దులతో ఊరేగింపు
- 108 మంది మహిళలు తెచ్చిన కృష్ణా నీటితో గ్రామంలో శివుడికి అభిషేకం



మారమునగాల కృష్ణానది వద్ద కాడెద్దులు, నీటి బిందెలతో మహిళలు



కాడెద్దులతో ఊరేగింపుగా గ్రామానికి వస్తున్న రైతులు

మానవపాడు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : వరుణ దేవా కురుణించవా అంటూ రైతులు దేవుళ్లకు పూజలు చేస్తున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలంలోని జల్లాపురం గ్రామం రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం శివుడు, ఆంజనేయస్వామికి జలాభిషేకం చేశారు. గ్రామం నుంచి 50 జతల కాడెద్దులతో, 108 బిందెలతో మహిళలు 12 కిలో మీటర్లు దూరంలో ఉన్న మారమునగాల గ్రామం సమీపంలోని కృష్ణా నది వద్దకు చేరుకున్నారు. అక్కడే నదిలో ఆంజనేయస్వామి మూలవిగ్రహానికి పుణ్యస్నానాలు చేయించారు. అనంతరం కాడెద్దులు, నిండు బిందెలతో మహిళలు ఊరేగింపుగా గ్రామానికి చేరుకొని శివాలయంలోని శివలింగానికి జలాభిషేకం చేశారు. ఈ విధంగా పూజలు చేస్తే వరుణ దేవుడు కరిస్తాడని గ్రామస్థుల నమ్మకమని రైతు సంఘం సభ్యులు తెలిపారు. ఈ ఊరేగింపులో గ్రామంలోని పెద్దలు, రైతులు, కూలీలు పాల్గొన్నారు.



కృష్ణానదిలో బిందెలతో నీళ్లు తెస్తున్న మహిళలు

మెరుగైన వైద్యం అందించాలి

- ఆసుపత్రిని తనిఖీ చేసిన రాష్ట్ర మానిటరింగ్ అధికారి ఫణీందర్‌రెడ్డి



గద్వాల జనరల్ ఆసుపత్రిని పరిశీలిస్తున్న రాష్ట్ర మానిటరింగ్ అధికారి ఫణీందర్‌రెడ్డి

గద్వాల న్యూటౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జిల్లా జనరల్ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని టీజీఎంఎస్ఐడీసీ ఎండీ రాష్ట్ర మానిటరింగ్ అధికారి ఫణీందర్‌రెడ్డి అన్నారు. శనివారం జోగుళాంబ గద్వాల జిల్లా జనరల్ ఆసుపత్రిని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి ప్రతీ రోజు ఎంతమంది అవుట్ పేషెంట్లు వస్తున్నారు. ఎంతమంది ఇన్ పేషెంట్లుగా సేవలు తీసుకుంటారని ఆరా తీశారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు అందుతున్న వైద్యసేవలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ మెడికల్ కళాశాల, సెంట్రల్ మెడిసిన్ స్టోర్‌ను సందర్శించి సీఎంఎస్‌కు సరఫరా అవుతున్న మందుల గురించి తెలుసుకున్నారు. అదే విధంగా జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు వినోద్, చైతన్య, ఫార్మాసిస్ట్ వెంకటస్వామి, వైద్యసిబ్బంది ఉన్నారు.

స్నేహం కోసం..

- ఆపదలో ఆదుకుంటూ చేయూతనిస్తున్న స్నేహితులు
- పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో మిత్ర సంఘాలు
- సామాజిక మాధ్యమాలతో చిన్ననాటి జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ..

7

గవర్నర్ చేతుల మీదుగా గద్వాల కలెక్టర్‌కు సన్మానం

గద్వాలన్యూటౌన్, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణత అభియాన్ రాష్ట్రస్థాయి అవార్డులలో భాగంగా గద్వాల జిల్లా గట్టు మండలానికి గుర్తింపు వచ్చింది. నీతి ఆయోగ్ సీఈవో ఆధ్వర్యంలో 2024 జూలై నుంచి సెప్టెంబరు మధ్య నిర్వహించిన సంపూర్ణత అభియాన్‌లో భాగంగా గట్టు మండలం 3 అంశాలలో 100 శాతం నమోదు చేసింది. శనివారం రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ రాజ్‌భవన్‌లో కలెక్టర్ బీఎం సంతోష్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులను కాపర్ మెడల్‌తో సత్కరించారు.



రాజ్‌భవన్‌లో గవర్నర్ చేతుల మీదుగా మెడల్, ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న కలెక్టర్

మత్స్య సంపద కోర్సులతో ఉద్యోగ అవకాశాలు

- ఎంసెట్ అర్హతల ఆధారంగా సీట్ల కేటాయింపు
- పరిశోధనలు చేసేందుకు సౌకర్యవంతమైన వసతులతో కళాశాల ఏర్పాటు
- నాలుగేళ్ల పాటు జలసంవర్ధక విద్య
- రాష్ట్రంలోనే ఏకైక చేపల కళాశాల



శిక్షణ పొందుతున్న విద్యార్థులు(ఫైల్)



మెండుగా ఉద్యోగ అవకాశాలు

తెలంగాణ రాష్ట్రంలోనే ఏకైక మత్స్య కళాశాల. విద్యార్థులకు మత్స్య రంగంలో మెండుగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి. రోజు రోజుకు చేప మాంసం వినియోగం పెరుగుతున్నది. విదార్థులకు నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థిని, విదార్థులకు వేరు వేరుగా వసతి గృహాలు, భోజనశాల, సౌకర్యవంతమైన వసతులు కల్పిస్తున్నాం.

- డాక్టర్ దుర్గం సకారాం, అసోసియేట్ డీన్, మత్స్య కళాశాల, పెబ్బేరు మునిసిపాలిటీ

పెబ్బేరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అందరూ నడిచే దారిలో ప్రయాణమా... అరుదైన కోర్సులతో భిన్నమైన మార్గమా... అర్హతలకు తగిన ఉద్యోగం దొరికితే చేరిపోదామా అనే ప్రశ్నలు ఇంటర్ చదివిన విదార్థులను వెంటాడుతుంటాయి. ఇంటర్ పూర్తి చేసిన వారు ప్రధానంగా ఇంజనీరింగ్, మెడికల్ కోర్సులపైనే చాలా మంది దృష్టి సారిస్తారు. వీటితో పాటు మత్స్య రంగం విద్యలో ప్రభుత్వ కొలువులు, స్వయం ఉపాధితో పాటు ప్రైవేట్ రంగంలో అపార అవకాశాలు ఉన్నాయి.

రాష్ట్రంలోనే ఏకైక మత్స్య కళాశాల..

పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్యశాలకు అనుబంధంగా వనపర్తి జిల్లా పెబ్బేరు మునిసిపాలిటీలో గత ప్రభుత్వం 2017లో మత్స్య కళాశాల ఏర్పాటు చేసింది. మత్స్య రంగాన్ని విస్తరింప చేయడంతో పాటు చేపల పెంపకంపై పరిశోధనలను అభివృద్ధి చేసేందుకు 27.5 ఎకరాల్లో శాశ్వత కళాశాల భవనం, విద్యార్థిని, విదార్థులకు విడివిడిగా వసతి భవనాలు, భోజనశాల భవనాలను ఏర్పాటు చేసింది. ఈ కళాశాలల్లో విద్యార్థులకు ఆక్వా కల్చర్, ఆక్వాటిక్ యానిమల్ హెల్త్ మేనేజ్‌మెంట్, ఫిషరీస్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఫిషరీస్ ఎక్స్‌టెన్షన్, ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ వంటి అంశాలపైన బోధిస్తున్నారు. మత్స్యకారులకు ప్రత్యేక శిక్షణ, పురోగతిపై విస్తరణ వంటి తదితర అంశాలను తెలియజేస్తుంటారు. ఇందులో డిగ్రీ చదివి పీజీ, పీహెచ్‌డీ చేసే అవకాశం ఉన్నది.

ఎంసెట్ అర్హతల ఆధారంగా సీట్ల కేటాయింపు

ఇంటర్‌లో బైపీసీ పూర్తి చేసి ఎంసెట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారికి మెరిట్ ఆధారంగా విద్యార్థుల ఎంపిక విధానం నిర్వహిస్తారు. నాలుగేళ్ల పాటు జలసంవర్ధక విద్య కోసం ప్రతీ ఏటా 26మంది విద్యార్థులకు అవకాశం ఉంటుంది. మొదటి మూడేళ్ల మత్స్య రంగ కోర్సులపై బోధిస్తారు. చివరి ఏడాది పాలేరులోని మత్స్య పరిశోధన కేంద్రంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. నాలుగేళ్ల విద్యను పూర్తి చేసిన వారికి మత్స్యశాఖ అభివృద్ధి అధికారులుగా, ఫిషరీస్ ఇన్‌స్పెక్టర్లుగా ప్రభుత్వ కొలువులు పొందవచ్చు. బ్యాంకింగ్ రంగంలో టెక్నికల్ ఫీల్డ్ ఆఫీసర్లుగా కొలువులు లభిస్తాయి.

శ్రీశైలం ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద

- ఇన్‌ఫ్లో 2.69 లక్షలు, అవుట్‌ఫ్లో 2.53 లక్షల క్యూసెక్కులు
- జూరాల ప్రాజెక్టుకు నుంచి 1.80 లక్షలు, ఆల్మట్టి నుంచి 80 వేలు, భీమానది నుంచి 90 వేల క్యూసెక్కులు రాక



శ్రీశైలం ప్రాజెక్టు ఆరు గేట్ల ద్వారా విడుదల అవుతున్న నీరు

గద్వాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కృష్ణా ప్రాజెక్టులకు వరద కొనసాగుతోంది. ఆల్మట్టి, తుంగభద్ర ప్రాజెక్టుల నుంచి కొంత వరద తగ్గినప్పటికీ భీమా నది నుంచి వరద కొనసాగుతోంది. దీంతో శనివారం శ్రీశైలం ప్రాజెక్టుకు 2.69 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా ఆరు గేట్ల ద్వారా 1,61,530 క్యూసెక్కులు, ఎడమ, కుడి విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా 66,102 క్యూసెక్కులను నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 885 అడుగులు కాగా ప్రస్తుతం 882.20 అడుగుల్లో 215 టీఎంసీలకు గాను 200.19 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. ఇక ఆల్మట్టి ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో తగ్గింది. 1.29 లక్షలు ఉండగా అవుట్‌ఫ్లో 80 వేల క్యూసెక్కులు ఉన్నది. నారాయణపూర్ ప్రాజెక్టుకు 80 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అవుట్‌ఫ్లోను 48,600 క్యూసెక్కులకు తగ్గించారు. ఇక భీమా ప్రాజెక్టు నుంచి వరద కొనసాగుతోంది. సన్నతి బ్యారేజీకి ఇన్‌ఫ్లో 90 వేలు ఉండగా అంతే మొత్తం దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాలకు 1.60 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 10 గేట్ల ద్వారా 99,460 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 25,843 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర నుంచి 25 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా శ్రీశైలంకు 15,516 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు..

మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్లో ఇద్దరు అవుట్ సోర్సింగ్ సిబ్బంది తొలగింపు

నాగర్‌కర్నూల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్లో ఇద్దరు అవుట్ సోర్సింగ్ సిబ్బందిని తొలగించారు. అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న డిప్యూటీ వార్డెన్, డాటా ఎంట్రీ ఆపరేటర్ అదే సంస్థలో పని చేస్తున్న మణెమ్మ అనే స్వీపర్‌ను పదివేల రూపాయలు లంచం అడిగిన నేపథ్యంలో ఆడియో వైరల్ అయింది. ఈ నేపథ్యంలో మైనార్టీ రెసిడెన్షియల్ రీజనల్ కో ఆర్డినేటర్ బాబుద్దీన్, జిల్లా మైనార్టీ విభాగం ఉపాధ్యాయులు గోపాల్‌నాయక్ ఇచ్చిన నివేదిక మేరకు డిప్యూటీ వార్డెన్ దర్వేష్, డాటా ఎంట్రీ ఆపరేటర్ ముస్తాక్‌లను తక్షణం తొలగించారు. మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్లో పిల్లలతో పాత ఇనుప సామాన్లు మోయించిన వార్డెన్ సుంకన్నపై కూడా విచారణ నివేదికను అందించారు. అతనిపై కూడా చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

కాంస్య పతకం అందుకున్న జాగిలం రుద్ర



వరంగల్ జిల్లాలో జరిగిన రాష్ట్ర రెండవ పోలీస్ డ్యూటీలో క్యాంస పథకం అందుకున్న పేట జిల్లాకు చెందిన జాగిలం రుద్ర

నారాయణపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట పోలీస్ జాగిలం రుద్ర బ్రాంజ్(కాంస్య) మెడల్ శనివారం అందుకుంది. వరంగల్ జిల్లాలోని పీటీసీ మమునూరులో మూడు రోజులుగా జరిగిన తెలంగాణ రాష్ట్ర రెండవ పోలీస్ డ్యూటీ మీట్‌లో జోగుళాంబ జోన్ నుంచి ట్రాకింగ్ విభాగం పోటీల్లో పాల్గొని హత్యా నేరాలు, దొంగతనాలను ట్రాకింగ్ చేయడంలో పేట పోలీస్ జాగిలం రుద్ర, డాగ్ హ్యాండ్లర్ రవికి బ్రాంజ్ మెడల్ వచ్చింది. ఈ విషయాన్ని జోగు ళాంబ జోన్ పోలీస్ డ్యూటీ మీట్ నోడల్ అధికారి అదనపు ఎస్పీ ఎండీ రియాజ్ హుల్ హక్ తెలిపారు. డాగ్ రుద్ర, హ్యాండ్లర్ రవిని అదనపు ఎస్పీ అభినందించారు. 2026 సంవత్సరం ఫిబ్రవరిలో పుణెలో జరిగే నేషనల్ పోలీస్ డ్యూటీ మీట్లో పాల్గొని మరిన్ని పతకాలు సాధించాలని అదనపు ఎస్పీ ఆకాంక్షించారు.

కిసాన్ డబ్బుల కోసం కన్న తల్లిపై దాడి

- తలపగిలి గాయాలతో ఆసుపత్రిపాలు
- ఇద్దరు కొడుకులపై కేసు నమోదు

అలంపూరుచౌరస్తా, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నవమాసాలు మోసి కనిపెంచి పెళ్లిళ్లు చేసి సాది సంతరించిన తల్లికి అన్నం పెట్టలేదు.. ఆమె పేరిట భూమిని అనుభవిస్తూ.. కూడా ఆమెకు వచ్చే రైతుబంధు, పీఎం కిసాన్ డబ్బుల కోసం వేధించారు. ఇవ్వనంటే చిన్న కొడుకు బెదిరించాడు. పెద్ద కొడుకు దాడిచేశాడు. హృదయవిషాదకర ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండలం, కలుగొట్ల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కురువ నాగన్న, లక్ష్మీదేవమ్మలకు శంకర్, మల్లికార్జున్ ఇద్దరు కొడుకులు. వీరికి 2ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి ఉంది. ఏడాది క్రితం నాగన్న అనారోగ్యంతో మృతి చెందగా, తల్లిదండ్రులు కట్టించిన ఇంట్లో పెద్ద కొడుకు శంకర్ ఉన్నా అన్నం పెట్టకపోవడంతో అదే ఇంట్లో తల్లి లక్ష్మీదేవమ్మ విడిగా ఉంటూ కూలినాలీకి చేసుకుంటూ బతుకుతోంది. చిన్న కొడుకు అదే ఊర్లో అద్దె ఇంట్లో ఉంటూ.. పదిరోజుల క్రితం రైతు భరోసా డబ్బుల కోసం వచ్చి బెదిరించి కొట్టి వెళ్లాడు. తాజాగా పీ ఎం కిసాన్ డబ్బులు తల్లి అకౌంట్లో పడ్డాయన్న విషయం తెలిసి పెద్ద కొడుకు శంకర్ డబ్బులు ఇవ్వమని శనివారం అడిగాడు. భూమి అనుభవిస్తున్నందుకు రూపాయి ఇవ్వరూ.. పైగా ఈ డబ్బులు కూడా మీకే ఇస్తే నేనెలా బతకాలని వాదించింది. తల్లిపై గొడవపెట్టుకుని కర్రతో దాడి చేయడంతో తలకు రక్తగాయమైంది. ఆమెను భర్త తమ్ముని కుమారుడు వెంకట్రాముడు కర్నూలు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరు కొడుకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్య

మిడ్జిల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని బోయిన్‌పల్లి గ్రామానికి చెందిన రాఘవేందర్(35) పురుగుల మందు ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు శనివారం తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ వివరాల ప్రకారం.. రాఘవేందర్ శుక్రవారం తన వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకుంటున్నానని కుటుంబ సభ్యులకు ఫోన్‌ద్వారా సమాచారం అందించినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లే సరికి రాఘవేందర్ పురుగుల మందు తాగి ఉండటం గమనించి వెంటనే చికిత్సకై జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాఘవేందర్ శనివారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి సోదరుడు అంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టెబుల్ శ్రీనివాసులు తెలిపారు.

వివాహిత అదృశ్యం.. కేసు నమోదు

మిడ్జిల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మిడ్జిల్ మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన సంపంగి ఈశ్వర్‌వర్మ భార్య మానస శనివారం ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయినట్లు భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్‌కానిస్టెబుల్ శ్రీనివాసులు శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉదయం 11 గంటల ప్రాంతంలో పని నిమిత్తం బయటకు వెళ్లిన ఈశ్వర్‌వర్మకు భార్య ఫోన్‌చేసి ఎక్కడున్నావని అడిగింది. 12గంటల ప్రాంతంలో తన భార్యకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో అనుమానం వచ్చిన ఈశ్వర్‌వర్మ ఇంటికి రావడంతో తన నాలుగు నెలల బాలుడు ఇంటివద్దే కనిపించాడు. భార్య కనిపించకుండాపోవడంతో చుట్టుపక్కల, బంధువుల వద్ద సమాచారం రాకపోవడంతో వెంటనే తమకు ఫిర్యాదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు. కాగా ఈశ్వర్‌వర్మ, మానసలది ప్రేమ వివాహమని తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందని పేర్కొన్నారు.

వ్యాపారం.. రోడ్డెక్కుతోంది!

- ప్రధాన రహదారికి అనుసరించి షాపులు ఏర్పాటు చేస్తున్న వ్యాపారులు
- మన్ననూర్ నుంచి శ్రీశైలం వరకు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు
- ఇరుకుగా మారుతున్న శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారి



ఎడమ పాతాళగంగలో రోడ్డు పక్కనే ఉన్న షాపులు

బ్రహ్మగిరి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రోజు రోజుకు శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన రహదారి ఇరుకుగా మారుతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మన్ననూర్ నుంచి శ్రీశైలం వరకు స్థానిక వ్యాపారులు కిరాణ షాపులు, హోటళ్లు ఒకరికి మించి మరొకరు పోటీపడి ప్రధాన రహదారికి అనుసరించి నిర్మాణాలు చేస్తుండటంతో వాహనాలు నిలిచిపోయి గంటల తరబడి యాత్రికులు నిరీక్షించాల్సి వస్తున్నది. ఎన్‌హెచ్‌ఏ నిబంధనల ప్రకారం శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన రహదారి 100 అడుగులు కాగా, ప్రస్తుతం నిర్మాణం చేసిన రోడ్డు 23 అడుగులు ఉంది. రోడ్డు సెంటర్ నుంచి ఇరువైపులా 50 అడుగుల వరకు రోడ్డు స్థలం వదిలేసి నిర్మాణాలు చేసుకోవాలని, గతంలో ముందుకు వచ్చి నిర్మాణాలు చేసిన ఇళ్లకు 30 సంవత్సరాల క్రితమే ఎన్‌హెచ్‌ఏ శాఖ అధికారులు మార్కింగ్ చేశారు. అయినా వ్యాపారస్థులు మన్ననూర్, వటువర్లపల్లి, బ్రహ్మగిరి, పాతాళగంగ గ్రామాల్లో ఐదు అడుగుల దూరం కూడా లేకుండా షాపులు నిర్మించుకున్నారు. కాగా, వ్యాపారానికి సంబంధించిన బోర్డులు, హోర్డింగ్‌లు జాతీయ రహదారికి పక్కవెంట ఏర్పాటు చేస్తుండటంతో వాహదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

ప్రమాదాలకు కారణం..

మన్ననూర్ నుంచి శ్రీశైలం వరకు 78 కిలో మీటర్లు పూర్తిగా మలుపులతో కూడిన ఘాట్ రోడ్డు కావడంతో వాహనాలు చాలా దూరం ప్రయాణం చేస్తుంటాయి. సక్రమంగా స్పీడ్‌బ్రేక్‌లు లేకపోవడం, గ్రామాల్లో రోడ్డును అనుసరించి షాపులు ఉండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రధానంగా వటువర్లపల్లి నుంచి పాతాళగంగ, సుండిపెంట, శ్రీశైలం వరకు ఎక్కువగా ఇరుకైన ఘాట్ రోడ్డు ఉండటంతో వాహనాలు ఢీ కొనడం, అదుపు తప్పి బోల్తా పడటం వలన నిత్యం ప్రమాదాలకు నిలయంగా శ్రీశైలం ఘాట్ రోడ్డు మారింది. దీనంతటికీ కారణం రోడ్డు ఇరుకుగా ఉండటం అని, నాయకులు, అధికారులు స్పందించి ముఖ్యంగా గ్రామాల్లో రోడ్డు విస్తరణ చేపట్టాలని వివిధ గ్రామాల ప్రజలు, శ్రీశైలం వచ్చి పోయే యాత్రికులు కోరుతున్నారు.

రోడ్డు స్థలం వదిలేసి నిర్మాణం చేసుకోవాలి

శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన రహదారి సెంటర్ నుంచి 50 అడుగులు ఇరువైపులా వదిలేసి వ్యాపారులు నిర్మాణాలు చేసుకోవాలి. మన్ననూర్ నుంచి పాతాళగంగ వరకు రోడ్డుకు అనుసరించి కట్టిన షాపులను తొలగించేందుకు నోటీసులు ఇస్తాం. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

- రమేశ్, డీఈ, ఎన్‌హెచ్‌ఏ కల్వకుర్తి డివిజన్

ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్ రెడ్డి



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్ రెడ్డి

కల్వకుర్తి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): దేశంలో, రాష్ట్రంలో పెరిగిపోతున్న అసమానతలు, ప్రజా సమస్యల పరిష్కానికి ప్రజా పోరాటాలకు ప్రజలంతా సిద్ధం కావాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా మహాసభలు శనివారం రెండోరోజు జరిగాయి. స్థానిక శుభం గార్డెన్‌లో శనివారం ప్రతినిధుల సభ జరిగింది. ఈ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఎర్రజెండా అండగా ఉంటుందని, ఆది నుంచి ప్రజల సమస్యల పరిష్కారం కోసం సీపీఐ ముందుండి పోరాటం చేసిందన్నారు. 100 ఏళ్ల చరిత్ర కలిగిన కమ్యూనిస్టు పార్టీని ఎవ్వరు అణిచివేయాలని చూడలేదన్నారు. ప్రజలకు అన్యాయం జరిగితే సీపీఐ సహించబోదని, మత రాజకీయాలను ప్రోత్సహించకుండా లౌకిక వాదులతో కలిసి నిరోధిస్తున్నట్లు పేర్కొన్నారు. నూతన సమాజ నిర్మాణం కోసం ప్రతీ ఒక్కరు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బాల్‌నరింహ, సీపీఐ నాయకులు ఆనంద్, ఫయాజ్, కేశవులు గౌడ్, అనిల్ కుమార్, నర్సింహ, ఏసు, విజయుడు, ఇందిరమ్మ, చంద్రమౌళి, కొమ్ము భరత్, పులిజాల పరుశరాములు, డాక్టర్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ నూతన కార్యదర్శిగా ఫయాజ్



ఎస్ ఎండి ఫయాజ్

నాగర్‌కర్నూల్ జిల్లా సీపీఐ కార్యదర్శిగా ఎస్ఎండీ ఫయాజ్ ఎన్నికయ్యారు. సీపీఐ జిల్లా మూడవ మహాసభలలో భాగంగా కల్వకుర్తి పట్టణంలో శుభం ఫంక్షన్ హాలులో శనివారం రెండవ రోజు ప్రతినిధుల సభలో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ ఫయాజ్‌తో పాటు హెచ్ ఆనంద్, జి.వార్ల వెంకటయ్య, కే కేశవులుగౌడ్, టి.నర్సింహ, ఈర్ల చంద్రమౌళి, కే యేసయ్య, హెబ్బేటి విజయుడు, కొమ్ము భరత్, ఆర్.ఇంద్రమ్మలను జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రజల సంక్షేమం కోసం రూ.లక్ష కోట్లు ఖర్చు

(5వ పేజీ తరువాయి...)

ముంపు ముప్పు లేకుండా సుమారు 60 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లామని, మీ సహకారం కూడా కావాలని ఉప ముఖ్యమంత్రి ని కోరారు. శ్రీశైలం ప్రాజెక్టు ముంపు బాధితులకు 98 జీవో ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సి ఉండే కానీ అది నెరవేరలేదని, వారికి కనీసం పంచాయతీ సెక్రటరీ లేదా లష్కర్ ఉద్యోగాలు ఇవ్వాలని, లేకపోతే ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ఉప ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో లైబ్రరీల అభివృద్ధికి కోటి రూపాయలు ఇస్తానని ప్రకటించిన ఎంపీ మల్లు రవికి ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. తెలంగాణ ఏర్పడకముందు రూ.75వేల కోట్ల అప్పు ఉంటే పదేండ్ల పాలనలో రూ.8 లక్షల కోట్ల అప్పు అయిందని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో కొత్త రేషన్ కార్డులు ఇచ్చిన దాఖలాలు లేవని ఎద్దేవా చేశారు. ఇంకా చేయాల్సింది చాలా ఉందని, వాటన్నింటిని అమలు చేసి తీరుతామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆ తరువాత రైతులకు రూ.10 కోట్ల విలువైన విద్యుత్ సామగ్రి , నియంత్రికలను పంపిణీ చేశారు. అనంతరం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, రేషన్ కార్డులను అందజేశారు.




రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లను అందిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి

అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉచిత ఆర్టీసీ ప్రయాణానికి రూ.6,680 కోట్ల రూపాయలను ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించిందని తద్వారా ప్రజలకు ఆర్టీసీతో పాటు ప్రభుత్వానికి లాభం చేకూరిందని తెలిపారు. గృహ అవసరాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను ప్రభుత్వం అమలు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు.

వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ... రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో దయ్యాలకు ,భూతాలకు అవకాశం ఇవ్వొద్దని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయం గద్వాల మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ సరిత తిరుపతయ్య, పిసిసి ఉపాధ్యక్షులు చింతలపల్లి జగదీశ్వర్‌రావు, వివిధ మండలాల మాజీ ప్రజాప్రతినిధులు అల్లాపూర్ మునిసిపల్ మాజీ కౌన్సిలర్లు సంబంధిత శాఖల అధికారులు, కొల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు , ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

చేపలు పులుసు, చికెన్‌పై తినడానికి రాలే..

- ప్రభుత్వ పథకాలు వివరించేందుకు వచ్చా
- కాంగ్రెస్ నాయకుడిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎంపీ మల్లురవి



సభలో మాట్లాడుతున్న నాగర్‌కర్నూలు ఎంపీ మల్లు రవి

కొల్లాపూర్, (ఆంధ్రజ్యోతి): తాను కొల్లాపూర్‌కు మంత్రి జూపల్లి కృష్ణారావు పెట్టిన చేప పులుసు, చికెన్‌పై తినడానికి రాలేదని ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించేందుకు వచ్చానని నేను మాట్లాడుతుండగా ఆపమనడానికి నువ్వు ఎవరంటూ కాంగ్రెస్ నాయకుడిపై నాగర్‌కర్నూలు ఎంపీ మల్లు రవి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్ జరిగిన ఉపముఖ్యమంత్రి సభలో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను ఎంపీ మల్లు రవి ప్రసంగిస్తుండగా ఆపాలని పెద్దకొత్తపల్లి మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు దండు నరసింహ చిట్టి రాసి ఇచ్చారు. దీంతో ఒకసారిగా మల్లు రవి కోపోద్రిక్తులై నాయకుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను సొల్లు మాట్లాడటం లేదని, ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాల గురించి మాట్లాడుతున్నానని, తనను ఆపమని చెప్పడానికి నువ్వు ఎవరు అని ఆగ్రహం వ్యక్తం చేస్తూ జూపల్లి ఇలాంటి వారిని తన దగ్గరకు రాకుండా చూడండి అంటూ మల్లు రవి చెప్పారు. ఢిల్లీలో మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీతో మీటింగ్ ఉన్నా ఇక్కడి సభకు వచ్చినట్లు చెప్పారు. కాసేపటి తరువాత తన ప్రసంగాన్ని ముగించారు.

సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయాలి

- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు చేసేందుకు జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం సోమశిల తెలంగాణ టూరిజం గెస్ట్ హౌస్ వద్ద జిల్లా అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో పొరపాట్లకు తావు లేకుండాని జమైన లబ్ధిదారులకు అందేలా చూడాలని ఆదేశించారు. ముఖ్యంగా గురుకులాల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని ఆదేశించారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రాత్రి సోమశిల గ్రామంలో మృగవాని కాటేజీలలో ఉపముఖ్య మంత్రి రాత్రి బస చేసి ఆదివారం ఉదయం రోడ్డు మార్గం ద్వారా హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కానున్నారు.



జిల్లా రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , మంత్రి జూపల్లి కృష్ణారావు, చిత్రంలో ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, రాజేష్ రెడ్డి, మేఘారెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి

స్నేహం కోసం..

మధురమైనది మిత్రబంధం




స్నేహానికి ఎల్లలు లేవు. నిజమైన మిత్రులకు మించిన ఆస్తి లేదు. మంచి మిత్రుడు తోడుంటే ఆయుధం ధరించిన భరోసా ఉంటుంది.. స్నేహ బంధం ప్రతిఫలాన్ని ఆశించని మొగ్గలా ప్రారంభమై మహా వృక్షంగా ఎదిగి జీవితాంతం తోడు నిస్తుంది. కన్నవారితో, కట్టుకున్న వారితో, తోడ బుట్టిన వారితో, చెప్పుకోలేని విషయాలను మిత్రులతో చెప్పుకోవడం మిత్రుత్వ గొప్పతనం. జీవితమనే ఉద్యాన వనంలో అందమైన పుష్పం స్నేహం. ఇచ్చింది మరచిపోవడం.. పుచ్చుకున్నది జ్ఞాపకం ఉంచుకోవడమే స్నేహమని ఓ సందర్భంగా జాతిపిత మహాత్మాగాంధీ పేర్కొన్నారు. ఆగస్టు నెల మొదటి ఆదివారం ఈనెల 3న ప్రపంచ స్నేహితుల దినోత్సవం (ఇంటర్నేషనల్ ఫ్రెండ్‌షిప్ డే) జరుపుకుంటారు. ఈ సందర్భంగా స్నేహితుల చేయూత, సామాజిక సేవా కార్యక్రమాలు, సోషల్ మీడియా ద్వారా దేశ, విదేశాల నుంచి మిత్రుల మధురస్మృతులు, సాధక బాధకాలు పంచుకుంటూ.. సాగిస్తున్న చాటింగ్‌పై ప్రత్యేక కథనం మీకోసం..

– నారాయణపేట/అచ్చంపేటటౌన్ (ఆంధ్రజ్యోతి)



బీష్మరాజ్ ఫౌండేషన్ సభ్యులు



స్నేహ మిత్రమండలి

ప్రతీ ఏటా రక్తదాన శిబిరాలు నిర్వర్తిస్తూ...

నారాయణపేటలో డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో 1985-87లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యాభ్యాసం చేసిన దోస్తులు 116 మంది కలిసి 2005లో స్నేహ మిత్రమండలి స్థాపించుకున్నారు. తోటి మిత్రులు ఒక్కొక్కరు ఒక్కో వృత్తిలో స్థిరపడినా తరచుగా కలుసుకుంటారు. ప్రతీ ఏటా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి సామాజిక బాధ్యతను చాటుతారు. తొమ్మిది ఏళ్లుగా రక్తదాన శిబిరాలు నిర్వహించి ఇప్పటివరకు 476 యూనిట్ల రక్తాన్ని సేకరించి బ్లడ్ బ్యాంకుకు అందించారు. అకాల మరణం చెందిన మిత్రమండలి సభ్యుల కుటుంబాలకు చేయి చేయి కలిపి ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారు.

హిందూ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

నారాయణపేటలో వివిధ పాఠశాలల్లో చదివిన 1090-91 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులతో 1991లో హిందూ ఫ్రెండ్స్ అసోసియేషన్‌ను స్థాపించారు. అధ్యక్షుడు ప్రవీణ్ మాంద్రే ఆధ్వర్యంలో కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ప్రతీ ఏటా గణేష్, కృష్ణాష్టమి, రక్షాబంధన్ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. 2018లో ద్విచక్రవాహనాలు నడిపే వారు హెల్మెట్ ధరించాలని పోలీసుల సహకారంతో అవగాహన కార్యక్రమం చేశారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా 2019లో శ్యాసన్‌పల్లి రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. తోటి మిత్రులకు ఏ ఆపద వచ్చినా మిత్ర బృందంలోని సభ్యులు అంతా ఏకమై తమ వంతు సహాయ సహకారాలు అందిస్తారు.

గెట్ టు గెదర్

చిన్నప్పటి దోస్తులను కలవాలంటే పేరంటాలు.. లేదంటే ఊరి జాతరలే వేదికలయ్యేవి. ఇవి కూడా ఎప్పుడో ఒకసారి జరిగేవి. కానీ గత ఐదారేళ్లలో చిన్నప్పటి స్కూల్ ఫ్రెండ్స్ అంతా పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు నిర్వహించుకోవడం పెరిగిపోయింది. దీనికి ప్రధాన కారణం వాట్సాప్ గ్రూపులే. ఒకరు పరిచయమైతే చాలు వారం, పది రోజుల్లోనే ఒకరి తర్వాత ఒకరి కాంటాక్ట్ నంబర్లు సాధించడం, అందరినీ గ్రూపుల్లో చేర్చడం చకచకా జరిగిపోతున్నాయి. బిజీ లైఫ్‌లో పరుగెత్తే మనిషికి చిన్ననాటి దోస్తులు వాట్సాప్ గ్రూపుల్లో అరేయ్, ఒరేయ్ అని పిలుస్తుంటే వయస్సు ఒక్కసారిగా తగ్గిపోయినట్టు అనిపిస్తోంది. పాఠశాల రోజుల్లో చేసిన అల్లర్లు గుర్తుచేసుకుంటూ, అప్పటి ముద్దుపేర్లతో ఆటపట్టిస్తుంటే ఆ వ్యక్తి జీవితంలో స్ట్రెస్ బూస్టర్‌గా మారుతోంది. అంతటితో ఆగనివాళ్లు మరో అడుగు ముందుకేసి పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆపదలో ఉంటే ఆదుకునేందుకు వాట్సాప్ గ్రూప్ వేదికగా మారింది. గ్రూపులో చర్చకు పెట్టడం, సాయం చేయాలని నిర్ణయించుకోవడం, ఆ తర్వాత ఒక్కొక్కరుగా యూపీఐ పేమెంట్లు ఒకరికి చేయడం, ఆ వ్యక్తి వెళ్లి ఇబ్బంది పడుతున్న దోస్త్‌కు సాయం అందించడం వంటివి వెనువెంటనే జరిగిపోతున్నాయి.

బీష్మరాజ్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు

నారాయణపేట ప్రభుత్వ గ్రౌండ్ స్కూల్‌లో 1996-97 పదోతరగతికి చెందిన స్నేహితులంతా కలిసి భీష్మరాజ్ ఫౌండేషన్‌గా ఏర్పడి చైర్మన్ రాజ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆలయాల అభివృద్ధి, పేటలో సీసీ కెమెరాల ఏర్పాటు, బడిబాట పట్టేలా విద్యార్థులను చైతన్యం చేయడం, నిరుపేదలకు ఆర్థికంగా చేయూతనందిస్తున్నారు. మొక్కలునాటి పచ్చదనం పెంపొందించడం, నిరుద్యోగులు ఉద్యోగ మేళాలు నిర్వహించడం, నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం, తాగునీటి ఎద్దడి నివారణకు బోర్లు వేయించడం, ప్రతిభావంతులకు అండగా నిలిస్తూ సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తున్నారు. పద్మభూషణ్ అవార్డు గ్రహీత దామరగిద్ద దాసరి కొండప్పకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించారు.



మిఠాయి తినిపించుకుంటున్న స్నేహితులు

ముందస్తు సంబురాలు

అయిజ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం సందర్భంగా ముందస్తు సంబురాలను పులికల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం ఉల్లాసంగా జరుపుకున్నారు. ఆదివారం పాఠశాలలకు సెలవు కావటంతో ఒక రోజు ముందస్తుగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈ సంబురాలు చేసుకున్నారు. చేతులకు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకుని, టిఫిన్‌లు ఒకరికొకరు తినిపించుకుంటూ సందడి చేశారు.



పేటలో స్నేహమిత్ర మండలి సభ్యులు

వారధిగా నిలుస్తోంది



10వ తగరతి వరకు నాగర్‌కర్నూల్‌లో చదువుకున్నాం. అప్పట్లో ఫోన్‌లు లేవు. ఆ తర్వాత పైచదువులు, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయాం. 2015 తర్వాత వాట్సాప్ ద్వారా పదవ తరగతి, ఇంటర్‌తో పాటు పైచదువులు చదివిన స్నేహితులను కలుసుకున్నాం. నిత్యం ఇప్పుడు ఎవరు ఎక్కడ ఉన్నారు అని చాట్ చేసుకుంటూ ఉంటాం. ఆపద వస్తే ఫ్రెండ్స్ అందరం కలిసి డబ్బులు వేసుకొని సహాయం చేస్తుంటాం.

– రాము, నాగర్‌కర్నూల్

క్రైం కార్నర్

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి రిమాండ్

» 220 గ్రాముల గంజాయి ప్యాకెట్ల పట్టివేత



గంజాయితో పట్టుబడిన వ్యక్తులు

మహబూబ్‌నగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి గంజాయి ప్యాకెట్‌లను తీసుకువచ్చి పాలమూరులో విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి వివరాల ప్రకారం ఎక్సైజ్ ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు శనివారం తెల్లవారుజామున బైపాస్ రహదారిలో వాహనాలు తనిఖీ చేస్తుండగా టీజీ 12బి 5057 వాహనంపై వచ్చిన హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు మహ్మద్ రియాజ్, సయ్యద్ అబ్దుల్ హుస్సేన్‌ల దగ్గర గంజాయి ప్యాకెట్‌లు లభించాయి. వీరిని అదుపులోకి తీసుకుని విచారించారు. హైదరాబాద్‌నుంచి చిన్నచిన్న గంజాయి ప్యాకెట్‌లను తీసుకొచ్చి పాలమూరులో విక్రయిస్తామని చెప్పారు. వీరి వద్ద 220 గ్రాముల ఎండు గంజాయి లభించింది. వీరిని న్యాయస్థానంలో న్యాయాధికారి ముందు హాజరుపరచగా, రిమాండ్ విధించడంతో జైలుకు తరలించినట్లు ఎక్సైజ్ అధికారులు పేర్కొన్నారు. ఈ తనిఖీలలో పాల్గొన్న అధికారులను ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయభాస్కర్‌రెడ్డి అభినందించారు. జిల్లా గంజాయి సరఫరా, వినియోగంపై నిఘా ఏర్పాటు చేశామని, అన్ని బ్లాక్ స్పాట్‌లపై దృష్టి సారించినట్లు పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనం, కారు ఢీకొని వ్యక్తి మృతి

» మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

కోస్గి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కారు-ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొని వ్యక్తి మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన నారాయణపేట జిల్లా కోస్గి మండలంలోని కడంపల్లి గేటు సమీపంలో చోటుచేసుకుంది. శనివారం ఏఎస్సై ఆంజనేయులు తెలిపిన కథనం మేరకు.. కోస్గికి చెందిన నవీన్, శివకుమార్, వికారాబాద్ జిల్లా పద్మారంకు చెందిన మహేష్(28) ముగ్గురు శుక్రవారం రాత్రి 11 గంటలకు గుండుమల్ వైపునుంచి కోస్గికి వస్తున్నారు. కోస్గి నుంచి నారాయణపేటకు వెళుతున్న కారు కడంపల్లి గేటువద్ద వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. మహేష్ అక్కడికక్కడే మృతి చెందగా, గాయాలపాలైన నవీన్, శివకుమార్‌ను కోస్గి ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ తరలించారు. కాగా, మృతుడు కోస్గిలో బియ్యం వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవాడు. వీరు ఇరువురు స్నేహితులుగా ఉండేవారని వారితో కలిసి గుండుమల్ వెళ్లి వస్తుండగా ఘటన జరిగిందని తెలిపారు. ఈ విషయంపై మృతుని అన్న ఉప్పు వెంకటేష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు.

ప్రీ ప్రైమరీ టీచర్స్‌గా తీసుకోవాలి

» ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి సీతక్కను కలిసిన అంగన్‌వాడీ టీచర్లు



మంత్రి సీతక్కతో ప్రీ ప్రైమరీ టీచర్స్‌గా నియమించాలని కోరుతున్న అంగన్‌వాడీ టీచర్లు

గద్వాల న్యూటౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్‌ను ప్రీ ప్రైమరీ టీచర్స్‌గా తీసుకోవాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్కకు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. హైదరాబాద్‌లోని శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అనసూయను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ అసోసియేషన్ సభ్యులు కలిసి ప్రభుత్వం త్వరలో తేబోతున్న ప్రభుత్వ పాఠశాలలలో ప్రీ ప్రైమరీ పాఠశాల నిర్వహణ కోసం అంగన్‌వాడీ టీచర్లను తీసుకోవాలని మంత్రికి వినతిపత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా అంగన్‌వాడీ ఉద్యోగులు మాట్లాడుతూ... గత 50 సంవత్సరాలుగా అంగన్‌వాడీ ఉద్యోగులుగా గౌరవ వేతనంతో పని చేస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతీ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాకుండా అనేక అదనపు ప్రభుత్వ కార్యక్రమాలను చేస్తున్నామన్నారు. ప్రభుత్వం ఇటీవలే ప్రవేశపెట్టిన ప్రభుత్వ పాఠశాలలో ప్రీ ప్రైమరీ పాఠశాలల నిర్వహణకు వేరే వలంటీర్లను నియమించడం కోసం జీవోను తెచ్చిందని, దానిని వెంటనే రద్దు చేయాలన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులు డిగ్రీలు, పీజీలతో పాటు ప్రీ స్కూల్ శిక్షణ, జాబ్‌కోర్సు ఆర్పీ ట్రైనింగ్‌లు, ప్రీ స్కూల్ కార్యక్రమాల మీద పూర్తి అవగాహన ఉన్నందున అర్హులైన అంగన్‌వాడీ ఉద్యోగులను నియమించాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి తదుపరి కార్యాచరణను పరిగణలోకి తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ సభ్యులు సౌదామిని, ఇందిరమ్మ, శ్రీలత, అనంతలక్ష్మి, సువర్ణ, వెంకటలక్ష్మి, శైలజ, సుజాత తదితరులు ఉన్నారు.

రైతులు ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

» అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ (ఏడీఆర్) డాక్టర్ రాంప్రకాశ్



పాలెం ఏజీ కాలేజీలో రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏడీఆర్ డాక్టర్ రాంప్రకాశ్

బిజినేపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన పథకాలను వినియోగించుకొని అధిక లాభాలను అర్జించాలని ప్రొఫెసర్ జయశంకర్ దక్షిణ తెలంగాణ రాష్ట్ర ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ రాంప్రకాశ్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని పాలెంలోని ఏజీ కాలేజీ ఆడిటోరియంలో శనివారం జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నిధులను రైతుల ఖాతాలో జమపై, వీడియో కాన్ఫరెన్స్‌ను రైతులతో కలిసి వీక్షించి మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకు వస్తున్న విప్లవాత్మక మార్పులను, సాగు అవసరాలను సులభతరం చేసేందుకు వినియోగించు కొని పెట్టుబడి ఖర్చులను, శారీరక శ్రమ, సమయాలను తగ్గించుకొని అధిక ఆదాయం పొందాలని సూచించారు. కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీదేవి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి యశ్వంత్ రావు, ఏడీఏ పూర్ణచంద్రా రెడ్డి, ఇన్‌చార్జి ఏవో కమల్ కుమార్, దేశీ ప్రోగ్రాం ఫెసిలిటేటర్ కృష్ణయ్య, ఆర్‌ఏఆర్ఎస్, కేవీకే శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ విస్తరణాధికారులు, రావేఫ్ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ధన్వాడ విద్యార్థినులు



ప్రశంసాపత్రం అందుకుంటున్న నాగలక్ష్మి, గీత

ధన్వాడ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా ధన్వాడకు చెందిన నాగలక్ష్మి, గీత అనే విద్యార్థినీలు జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో నాగలక్ష్మి, గీత పాల్గొని 23 విభాగంలో 55 కేజీల బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా వారికి నిర్వాహకులు ప్రశంసాపత్రం అందించారు. ఈనెల 21 నుంచి 24 వరకు జార్ఖండ్ రాష్ట్రంలో జరగబోయే జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొననున్నారని కోచ్ శ్రీనివాస్ తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థినులను డీవైఎస్‌వో వెంకటేష్, ఊసు రవికుమార్, సాయినాథ్‌లు అభినందించారు. జాతీయ స్థాయిలోనూ రాణించాలని కోరారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ సబ్‌జూనియర్ పోటీలకు జడ్చర్ల విద్యార్థులు



పోటీలకు ఎంపికైన జడ్చర్ల విద్యార్థినులు

జడ్చర్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు సిద్దిపేట జిల్లాలో జరిగే ఫుట్‌బాల్ సబ్ జూనియర్ పోటీలకు జడ్చర్ల విద్యార్థినులు ఎంపికయ్యారు. గత నెల 9న నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో జిల్లా జట్టుకు బాదేపల్లి బాలుర జడ్పీహెచ్ఎస్ విద్యార్థినులు పూజ, హిందు, వైష్ణవిలు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ శనివారం తెలిపారు. రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ సబ్‌జూనియర్ విభాగంలో ఎంపికైన విద్యార్థినులను పీడీలు రాంకల్యాణ్‌జీ, వడెన్న, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు కవులు, రచయితల డైరీ ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ పట్టణంలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో ఆదివారం ఉదయం 9 గంటలకు ఉమ్మడి జిల్లా కవులు, రచయితల 2025 డైరీ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలగాంణ సాహితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖాజామైనొద్దీన్, కొప్పోలు యాదయ్య, ప్రచార కార్యదర్శి ప్రమోద్ కుమార్‌లు ఒక ప్రకటనలో తెలపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ సాహితి రాష్ట్ర కార్యదర్శి కెఆనంద్ చారి, విశిష్ట అతిథులుగా జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షుడు ప్రముఖ న్యాయవాది మనోహర్ రెడ్డి, వల్లభాపురం జనార్దన, ఆత్మీయ అతిథిగా విజేత వెంకట్ రెడ్డిలు హాజరవుతరన్నారని పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లా నుంచి కవులు, రచయితలు, సాహితి అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కుటుంబ సభ్యుల వద్దకు చేరిన తప్పిపోయిన మహిళ



ఊట్కూర్ పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న శ్రద్ధ ఫౌండేషన్ సభ్యులు

ఊట్కూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేక ఆరు నెలల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన మహిళను ముంబయికి చెందిన శ్రద్ధ ఫౌండేషన్ సభ్యులు శనివారం ఊట్కూర్‌లో కుటుంబ సభ్యుల వద్దకు చేర్చారు. ఊట్కూర్ పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. ఊట్కూర్‌కు చెందిన ప్రైవేట్ ఉపాధ్యాయుడు మంజూర్ అహ్మద్ భార్య సబియా బేగంకు గత కొన్నేళ్ల నుంచి మతిస్థిమితం సరిగాలేదు. ఈ క్రమంలో ఆమె ఆరు నెలల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది. అయితే మళ్లీ ఎప్పటిలాగే తిరిగి వస్తుందని కుటుంబ సభ్యులు ఎక్కడా కూడా ఫిర్యాదు చేయలేదు. అయితే గత నెల మొదటి వారంలో గుజరాత్ రాష్ట్రంలో స్థానిక శ్రద్ధ ఫౌండేషన్ సభ్యులకు కనిపించడంతో ఆమెకు ఆశ్రయం కల్పించి వివరాలు సేకరించారు. అనంతరం ముంబయి ఫౌండేషన్ సభ్యులకు అప్పగించడం, వారు అక్కడి నుంచి ఆమెను నేరుగా ఊట్కూర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకోరావడం జరిగింది. అనంతనం పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసి వారి కుటుంబ సభ్యుల వివరాలు చెప్పడంతో పోలీసులు భర్త మంజూర్ అహ్మద్‌కు సమాచారం ఇచ్చారు. అనంతరం భర్త పోలీస్‌స్టేషన్‌కు రావడంతో పోలీసుల సమక్షంలో సబియాబేగంను భర్తకు అప్పగించారు. ఊట్కూర్ ఎస్సై రమేష్, ఫౌండేషన్ సభ్యురాలు ఎన్.అస్వతీ బృందం, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

అమ్మమ్మ మృతితో అనాథ అయిన బాలిక

వీపనగండ్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఆలనా పాలనా చూసే అమ్మమ్మ మృతి చెందడంతో అనాథ అయిన బాలికకు అండగా మే ముంటామని భరోసా ఇచ్చారు మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అధికారులు. వనపర్తి జిల్లా వీపనగండ్లలో శుక్రవారం అమ్మమ్మ వడ్డె బాలకి ష్టమ్మ మృతి చెందడంతో మనవరాలు అలివేల అనాథ అయింది. కల్వరాల గ్రామానికి చెందిన ఆ బాలిక తల్లిదండ్రులు కొన్ని సంవత్సరాల క్రితం అనారోగ్యంతో ఒకరి తరువాత ఒకరు మృతి చెందారు. ఆనాటి నుంచి అమ్మమ్మ దగ్గర ఉంటూ ప్రభుత్వ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతోంది. అమ్మమ్మ కూడా మృతి చెందడంతో ఆ బాలిక అనాథ అయింది. విషయం తెలుసుకున్న జిల్లా బాలల సంరక్షణ అధికారి రాంబాబు సీడీపీవో బాలీశ్వరమ్మ తమ బృందంతో వెళ్లి వీపనగండ్లలో ఉన్న ఆ బాలికను పరామర్శించి తామున్నా మని ధైర్యం చెప్పారు. బంధువులతో మాట్లాడగా చిన్నమ్మ సంధ్య తన దగ్గర ఉంటుందని, తాను చూసు కుంటానని తెలిపారు. మీకు వీలు కాకపోతే బాలసదనం సేవలు స్పాన్సర్ షిప్ పథకం ద్వారా బాగోగులు చూసుకుంటామని రాంబాబు తెలిపారు. ఏ అవసరం ఉన్నా తమను సంప్రదించాలని బాలికకు తెలిపారు. సూపర్‌వైజర్ నారాయణమ్మ, డీసీపీయూ సిబ్బంది నరేందర్, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

● ఆసుపత్రి ముందు ఆందోళన

కల్వకుర్తి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలంలోని రాఘవేంద్ర కాలనీకి చెందిన సాబేర్ (45) గుండెపోటుతో మృతి చెందాడు. శుక్రవారం అర్ధరాత్రి అతనికి ఛాతిలో నొప్పి రావడంతో పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తీసుక వెళ్లారు. ఆసుపత్రిలో ఈసీజీ తీసిన డ్యూటీ డాక్టర్ పరిస్థితి బాగానే ఉందని మందులిచ్చి పంపాడు. దాంతో కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకెళ్లారు. తెల్లవారు జామున గుండెపోటు రావడంతో అతడు మరణించాడు. దీంతో కుటుంబ సభ్యులు ఈసీజీ తీసినప్పుడు తేడా ఉందని చెబితే హైదరాబాద్‌కు తీసుకవెళ్లే వారమని శనివారం ఆసుపత్రి ముందు ఆందోళన చేశారు.

ఇంటర్వ్యూ..

ప్రగతిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు

- కృష్ణయ్య, ఎంపీడీవో, ఊర్కొండ



ఊర్కొండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రగతిలో ఉన్నాయని ఎంపీడీవో కృష్ణయ్య అన్నారు. మండలంలో ఇందిరమ్మ ఇళ్ల పనుల పురోగతిపై ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలు వెల్లడించారు.

ఇందిరమ్మ ఇళ్ల ప్రగతి ఎలా ఉంది ?

ఇందిరమ్మ గృహాలు మొదటి విడతగా మండలంలో 287 మంది నిరుపేద లబ్ధిదారులకు మంజూరైంది. అందులో 182 మంది ఇంటి నిర్మాణాలు ప్రారంభించారు. బేస్‌మెంట్ లెవల్‌లో 30, స్లాబ్ లెవల్ 4, కొందరికి బిల్లులు వచ్చాయి.

మండలంలో 287 మంది కాక మిగతా అర్హుల పరిస్థితి ఏంటి ?

ఎల్-1 లిస్టులో ఉన్న అందరు లబ్ధిదారుల వివరాలు మొబైల్ యాప్‌లో పొందుపరచడం జరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో వారికి ఇళ్ల నిర్మాణాలు రానున్న 4 సంవత్సరాల్లో పూర్తి చేసే విధంగా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయి.

గ్రామాల అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

మండలంలో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ సరఫరాలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత శాఖ అధికారులను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి కొనసాగేవిధంగా సూచనలు చేస్తున్నాము.

న్యూస్ బాక్స్

గ్రామీణ రోడ్లకు మహర్దశ

చారకొండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ హయాంలో గ్రామీణ రోడ్లకు మహర్దశ వచ్చిందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకట్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రం నుంచి రాంపురం వరకు రూ. 3.50 కోట్ల వ్యయంతో చేపట్టిన బీటీ రోడ్డు పనులను శనివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాంగౌడ్, మండల యూత్ ప్రెసిడెంట్ గణేష్‌గౌడ్, జెల్ల చంద్రయ్యగౌడ్, శ్రీనివాసులు, మాజీ ఎంపీ టీసీ నర్సింహారెడ్డి, నారాయణ్ సందీప్‌రెడ్డి, కళ్ల సురేందర్‌రెడ్డి, సత్తూరు శ్రీను పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దేవునితిర్మలాపూర్ గ్రామానికి చెందిన కేశంపేట శ్రీనివాసులు మృతి చెందగా, మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ ఆ గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళి అర్పించారు. సీపీఐ కార్యకర్తగా ఉన్న శ్రీనివాసులు శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. శనివారం మాజీ ఎంపీపీ నివాళులర్పించారు. పలువురు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ మాజీ సర్పంచ్ వి.సత్యం, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాసులు, గ్రామ పెద్దలు పెద్ద నిరంజన్, పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వెల్దండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఇటీవల మృతిచెందిన బండోనిపల్లి గ్రామానికి చెందిన ఎనుముల నారాయణరెడ్డి కుటుంబాన్ని శనివారం ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుని కుమారుడు ఎనుముల శేఖర్‌రెడ్డిని ఓదార్చారు. కార్యక్రమంలో ఉమాపతి, బిక్షపతి, ఉపేందర్, రవి, సురేష్, కుమార్ ఉన్నారు.

'నల్లమలలో అసైన్డ్ భూమిని పేదలకు పంచాలి'

అమ్రాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బీకే లక్ష్మాపూర్, మాధవానిపల్లి, వంగురోనిపల్లి తదితర గ్రామాల్లో ఉన్న రెండు వేల ఎకరాల అసైన్డ్ భూమిని ఆ ప్రాంతంలోని భూమిలేని పేదలకు పంచాలని దళిత సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు కలుముల నాసరయ్య, జక్క బాలకిష్టయ్య, అవుట రామకోటి, పర్వతాలు, రఘుపతి తదితరులు శనివారం అమ్రాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. రెండు రోజుల నుంచి అమ్రాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు గుట్టుచప్పుడు కాకుండా రికార్డులను పరిశీలించిన విషయంపై తాము అధికారులను ప్రశ్నిస్తే కలెక్టర్ ఆదేశాల మేరకు పని చేస్తున్నామని తహసీల్దార్ శైలేంద్ర కుమార్ చెప్పారని వారు తెలిపారు. అమ్రాబాద్ ఉమ్మడి మండలంలోని సూమారు 80 వేలకు పైగా జనాభాకు 30వేల ఎకరాలు మాత్రమే రెవెన్యూ భూమి ఉందని తెలిపారు. ఈ ప్రాంతంలో నివసిస్తున్న కొన్ని వేల మందికి గుంట భూమి కూడా లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ చొరవ తీసుకోవాలని కోరారు.

12న విశ్వకర్మల మహా పాదయాత్ర

నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 12వ తేదీన తలపెట్టిన విశ్వ కర్మ మహాపాదయాత్రను జయప్రదం చేయాలని విశ్వకర్మ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాయబండి పాండురంగాచారి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో విశ్వకర్మ జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో మహా పాదయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎల్‌బీ నగర్‌నుంచి గన్‌పార్కు అమరవీరుల స్థూపం వరకు పాదయాత్ర కొనసాగుతుందన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేయాలని, తెలంగాణ అమరుడు శ్రీకాంతాచారి విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్ఠించాలని, విశ్వబ్రాహ్మణ సహకార సొసైటీ ఏర్పాటు చేయాలని కోరారు. విశ్వకర్మ జేఏసీ నాయకులు దన్నోజు అరవింద్‌చారి, అజయ్ కుమార్‌చారి, ఓంప్రకాష్‌చారి తదితరులు పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ సంజయ్‌నగర్‌కాలనీలో డ్రైనేజీ నిండి పారుతున్న మురుగునీరు

పొంగి పారుతున్న మురుగు

- ధ్వంసమైన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ
- రెండేళ్లుగా మరమ్మతుకు నోచుకోని పబ్లిక్ బోరు
- నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ 16వ వార్డు సంజయ్ నగర్ కాలనీ దుస్థితి

ఆంధ్రజ్యోతి వార్డు వాచ్



సంజయ్‌నగర్‌కాలనీలో డ్రైనేజీ కాలువలో పేరుకుపోయిన చెత్త

నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ 16వ వార్డు సంజయ్‌నగర్ కాలనీలో అన్నీ సమస్యలే. కాలనీలోని పలు వీధుల్లో డ్రైనేజీ, పారిశుధ్యం సమస్యలు ప్రజలను తీవ్రంగా వేధిస్తున్నాయి. కాలనీలోని ప్రాథమిక పాఠశాల ఎదురుగా ఉన్న వీధుల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ మెయిన్‌వాల్వ్‌లు మూతలు పగిలిపోయి ప్రమాదకరంగా మారడంతో పాటు అందులోని మురుగునీరు పొంగిపొర్లి రోడ్ల మీద పారుతోంది. కాలనీలోని పలు వీధుల్లో డ్రైనేజీ కాలువ చెత్తతో పేరుకుపోయింది. దుర్వాసన వస్తుండడంతో పాటు దోమల బెడద పెరిగిందని కాలనీవాసులు వాపోతున్నారు. కాలనీలోని పబ్లిక్ బోరు మోటార్ పాడైపోయి దాదాపు మూడేళ్లు కావస్తున్నా పునరుద్ధరణకు నోచుకోలేదని సమీప ప్రజలు అంటున్నారు. దీంతో మిషన్ భగీరథ నీళ్లు వస్తే తప్ప అవసరాలకు వాడుకునేందుకు తాగునీరు లేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మునిసిపల్ అధికారులు తక్షణమే స్పందించి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

బోరు రిపేరు చేయించాలి



కాలనీలో పబ్లిక్ బోరు మోటార్ పాడైపోయింది. దీంతో కాలనీ ప్రజలం రెండు రోజులకోసారి వచ్చే మిషన్ భాగీరథ నీళ్లతోనే సరిపెట్టుకుంటున్నాం. డ్రైనేజీ సైడ్ కాలువలు నెలకోసారి శుభ్రం చేస్తున్నారు. అదికూడా తీసిన చెత్తను వెంటనే అక్కడి నుంచి తరలించడం లేదు. తక్షణమే పబ్లిక్ బోరు మోటార్ రిపేరు చేయడంతో పాటు పారిశుధ్య పనులు సక్రమంగా చేయాలి.

- పడిగె నర్సింహులు, సంజయ్‌నగర్‌కాలనీ, నాగర్‌కర్నూల్

గత పాలకుల నిర్లక్ష్యం



గత పాలకుల నిర్లక్ష్యం వల్ల కాలనీలో డ్రైనేజీ సమస్యలు ఏర్పడ్డాయి. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో రెండేళ్లకే పగిలిపోయి మరమ్మతులకు వచ్చాయి. వార్డులోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. మునిసిపల్ అధికారులు కాలనీలో పర్యటించి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ మరమ్మతులు, పబ్లిక్ మోటార్ రిపేరు చేయడంతో అవసరమైన చోట సీసీ రోడ్లు వేసేందుకు కొలతలు తీసుకెళ్లారు.

- కూచకుళ్ల రాజు, సంజయ్‌నగర్‌కాలనీ

అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



చారకొండ : అభయాంజనేయ స్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు ధేరం లక్ష్మణశర్మ

చారకొండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని రాంపురం ఆంజనేయస్వామి గుట్టపైన ఉన్న దాసాంజనేయస్వామి, గుట్ట దిగువన ఉన్న అభయాంజనేయ స్వామికి శ్రావణ శనివారం సందర్భంగా సిరసనగండ్ల సీతారామ చంద్రస్వామి ఆలయ అర్చకుడు ధేరం లక్ష్మణ శర్మ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సత్తారి జంగయ్య, నరేందర్, శేఖర్, శ్రీను, చిన్న అంతయ్య, విష్ణు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సామూహిక వ్రతాలు

ఊర్కొండ : మండలంలోని ఊర్కొండ పేట అభయాంజనేయ స్వామి ఆలయంలో శనివారం భక్తులు సామూహిక వ్రతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది మారతీరావు, వరలక్ష్మి, శ్రీశైలం అర్చకులు మహేష్ శర్మ, దత్తాత్రేయ శర్మ, ప్రవీణ్ శర్మ, శ్రీనివాస శర్మ, భక్తులు ఉన్నారు.

కళాకారులను గౌరవించడం అభినందనీయం

- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



కళాకారులకు డప్పులను అందజేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

వెల్దండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : కళలను, సంప్రదాయాలను సజీవంగా ఉంచుతున్న కళాకారులను గౌరవించడం అభినందనీయమని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం పెద్దాపూర్ గ్రామంలో మార్కెట్ డైరెక్టర్ కేశమల్ల కృష్ణ తన పుట్టినరోజును పురస్కరించుకుని పలువురు కళాకారులకు డప్పులను సమకూర్చగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై కళాకారులకు అందజేశారు. ఈ సందర్భంగా పుట్టినరోజు కేక్‌ను కట్‌చేసి కృష్ణను సన్మానించారు. అంతకుముందు స్థానికంగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నారాయణరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మండల కేంద్రంలో కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మోతీలాల్ జన్మదిన వేడుకలో ఎమ్మెల్యే పాల్గొని అభినందించారు. కార్యక్రమంలో నాయకులు మట్ట వెంకటయ్యగౌడ్, భూపతిరెడ్డి, హరికిషన్, రషీద్, పురుషోత్తమాచారి, శ్రీనుయాదవ్, లాలు, శ్రీనునాయక్, వెంకటేష్, పర్వత్‌రెడ్డి, పుల్లయ్య తదితరులు ఉన్నారు.

అభివృద్ధి చేయాలని అడిగితే అరెస్టులా?

- బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బల్మూరి జానకి



బీజేపీ నాయకురాలు జానకిని అరెస్టు చేస్తున్న టూటౌన్ ఎస్ఐ ఇందిర

అచ్చంపేటటౌన్ ఆగస్టు 2 (ఆంధజ్యోతి) : ఉమామహేశ్వర ఆలయాన్ని అభివృద్ధి చేయాలని అడిగితే అరెస్టు చేస్తారా అని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బల్మూరి జానకి అన్నారు. ఉమామహేశ్వర ఆలయాన్ని అభివృద్ధి చేయాలని మండల పరిధిలోని రంగాపూర్ గ్రామం నుంచి ఉమామహేశ్వర ఆలయం వరకు పాదయాత్ర చేస్తాశామని ప్రకటించిన నేపథ్యంలో పోలీసులు శనివారం ముందస్తుగా బీజేపీ నాయకులను అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. టౌన్ ఎస్ఐ ఇందిర అచ్చంపేటలో జానకి ఇంటికి వెళ్లి ఆమెను అరెస్టు చేశారు. ఈమెతో పాటు మిగతా నాయకులను అరెస్టు చేసి, మధ్యాహ్నం సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు. తక్షణమే పాదయాత్రకు అనుమతివ్వాలని ఆమె కోరారు.

న్యాయ సలహా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి నసీమ్ సుల్తానా



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి నసీమ్ సుల్తానా

కల్వకుర్తి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు న్యాయ సలహా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవా అధికారసంస్థ కార్యదర్శి నసీమ్ సుల్తానా అన్నారు. రాజీమార్గమని, చిన్న చిన్న విషయాలకు గొడవలకు దిగకుండా స్నేహభావంతో మెలగాలని ఆమె సూచించారు. కల్వకుర్తి మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత న్యాయ సలహా కేంద్రాన్ని స్థానిక కోర్టు న్యాయాధికారి కావ్యతో కలిసి శనివారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రతీ శుక్ర, శనివారాలలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజలకు న్యాయపరమైన సలహాలు, సూచనలు అందిస్తామని తెలిపారు. ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇబ్రహీం, న్యాయసలహా కేంద్రం నిర్వాహకు డు సుభాష్ చంద్రబోస్, న్యాయ సేవ సహాయ కులు మన్సూర్ ఖాన్, మల్లీశ్వరి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పశు సంపదను కాపాడుకుందాం

- పశువైద్యాధికారి ఉదయ్‌కుమార్‌రెడ్డి

తిమ్మాజిపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : గొర్రెలు, మేకలకు పోకుతున్న నీలి నాలుక వ్యాధి నివారణకు టీకాలు వేయించి పశు సంపదను కాపాడుకుందామని పశువైద్యాధికారి ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. తిమ్మాజిపేట, నేరేళ్లపల్లి గ్రామాల్లో శనివారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి గొర్రెలకు, మేకలకు టీకాలు వేశారు. పశువైద్యాధికారి శ్రావణి, పశువైద్య సిబ్బంది తిరుపతయ్య, విజయలలిత, అమీర్, యాదగిరి, శాంతయ్య, రవి ఉన్నారు.

కృష్ణానదిలో కొట్టుకుపోయిన యువకుడు

- కాపాడిన మత్స్యకారులు



ఎడమ పాతాళగంగ కృష్ణానదిలో యువకుడిని కాపాడుతున్న మత్స్యకారులు

బ్రహ్మగిరి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నలుగురు మిత్రులతో కలిసి వచ్చిన యువ కుడు ఎడమ పాతాళగంగలో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు కృష్ణానదిలోకి జారి పోవడంతో స్థానిక మత్స్యకారులు కాపాడిన సంఘటన శనివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో చోటు చేసుకున్నది. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం ఎడమ పాతాళ గంగలో జరిగింది. మత్స్యకారులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి నలుగురు యువకులు శ్రీశైలం డ్యాం గేట్ల సందర్శనకు వచ్చారు. అనంతరం మల్లన్న దర్శనం చేసుకునేందుకు ఎడమ పాతాళగంగ పుష్కర ఘాట్‌లో 25 సంవత్సరాల యువకుడు స్నానానికి దిగాడు. వేగంగా అలల తాకిడికి యువకుడు నీటిలోకి జారిపోయాడని మత్స్యకారులు లక్ష్మయ్య, గోపాల్, మల్లి పేర్కొన్నారు. నీటిలో కొట్టుకుపోతున్న యువకుడిని గమనించి తాము పుట్టిలో వెళ్లి రక్షించి ఒడ్డుకు చేర్చామన్నారు. కాగా, ఎడమ పాతాళగంగ పుష్కర ఘాట్ వద్ద పోలీసుల భద్రత కొరవడిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

కల్వకుర్తి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) :కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ డాక్టర్ శర్వాణి ఆధ్వర్యంలో తెలంగాణ ఆకాడమిక్ ఫర్ సిల్క్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా రీజనల్ కో-ఆర్డినేటర్ మహమ్మద్ సిరాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో టాస్క్ నిర్వహించే కోర్సులను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరాలని సూచించారు. అదేవిధంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శిర్వాణి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉండి రెగ్యులర్ కోర్సులతో పాటు టాస్క్ వారు అందించే సిల్క్ డెవలప్‌మెంట్ కోర్సులలో ఉన్నతమైన ఉద్యోగాలు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్, కో-ఆర్డినేటర్, అధ్యాపక అధ్యాపకే తర, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకుంటున్న విద్యార్థులు

వెల్దండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొట్రతాండా శాస్త్ర ఇంటర్నేషనల్ పాఠశాలలో శనివారం విద్యార్థులు స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తొలి స్నేహితులైన తల్లిదండ్రులకు గురువులకు ఫ్రెండ్‌షిప్ బ్యాండు కట్టి వారికి పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గుబ్బ శంకరయ్య, డైరెక్టర్లు నరేష్, సాయిస్వరూప్, సృజన్‌బాబు, ప్రిన్సిపాల్ రవితేజ, వైస్ ప్రిన్సిపాల్ మోహన్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు కృషి

- రోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ



రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అమ్రాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ శనివారం పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మాస్టర్ ప్లాన్ రూపొందించి ఈ రోడ్డు విస్తరణ పనులను చేపట్టినట్లు తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణంతో పాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ పనులు చేపట్టడం ద్వారా కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రజలు సహకరిస్తే రోడ్డు విస్తరణ పనులు త్వరలోనే పూర్తవుతాయని తెలిపారు. ఈ పనులకు ఎవరైనా ఆటంకాలు కల్గిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. అచ్చంపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాసుమల్ల వెంకటయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హరి నారాయణగౌడ్, నాయకులు మల్లికార్జున్, రాజగోపాల్, బాల్‌లింగంగౌడ్, ముక్రంఖాన్, తిరుపతయ్య గౌడ్, మనోహర్ పాల్గొన్నారు.

10న మెగా క్యాంపు

అచ్చంపేటటౌన్ : ఈ నెల 10వ తేదీన నిర్వహించే మేఘా హెల్త్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. ఈ నెల 6న పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో జరగాల్సిన మెఘా సర్జికల్ క్యాంపును కొన్ని కారణాల వల్ల ఈ నెల 10వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలు తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పేదవాడి ఆత్మగౌరవ ప్రతీక రేషన్‌కార్డు

అచ్చంపేట : పేదవాడి ఆత్మగౌరవ ప్రతీక రేషన్‌కార్డు అని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శనివారం లింగాల మండల కేంద్రంలో నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎక్కడ ఉప ఎన్నికలు వస్తే అక్కడ రేషన్ కార్డులు ఇచ్చారని ఆయన ఎద్దేవాచేశారు. నాయకులు శ్రీనివాస్ రాథోడ్, రాజు నాయకులు ఉన్నారు.

ఉమామహేశ్వరం ఆలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

- ఆలయ చైర్మన్ బీరం మాధవరెడ్డి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిటీ చైర్మన్ మాధవరెడ్డి

అచ్చంపేట, ఆగస్టు 2 (ఆంధజ్యోతి) : శ్రీశైల ఉత్తరముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వెళుతున్నామని ఉమామహేశ్వర ఆలయ చైర్మన్ బీరం మాధవరెడ్డి అన్నారు. భోగమహేశ్వరంలో జరిగిన అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. బీజేపీ నాయకులు అభివృద్ధిని చూసి ఓర్వలేక పోతున్నారన్నారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే రూ.4కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. రాష్ట్ర మంత్రి కొండసురేఖ పర్యటించినప్పుడు పర్యాటక క్షేత్రంగా గుర్తించాలని కోరినట్లు తెలిపారు. రంగాపూర్ నుంచి ఉమామహేశ్వరం ఆలయం వరకు సెంట్రల్ లైటింగ్‌తో ఏర్పాటు చేయాలని రూ 16కోట్లతో అనుమతులు ముఖ్యమంత్రిని ఎమ్మెల్యే కోరారని పేర్కొన్నారు. ఉమామహేశ్వర ఆలయంలో అభివృద్ధిని ఓర్వలేక లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళి



పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బిజినేపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగారంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు, ప్రజా వాగ్గేయకారుడు రాజారాం ప్రకాశ్ మాట్లాడుతూ మూడు రంగుల జెండాను రూపొందించిన పింగళి వెంకయ్యకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ఇచ్చి సముచిత గౌరవం కల్పించాలని కోరారు. దేశ పతాకం రూపొందించి స్వాతంత్ర పోరాటంలో నాయకులకు, ప్రజలకు దేశభక్తి రగిలించారని కొనియాడారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం బాలకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు రాజప్ప, మహమ్మద్, అశోక్‌కుమార్, కొములయ్య, శ్రీకాంత్‌రెడ్డి, ఊర్మిళ, ఇందుమతి, విద్యార్థులు ఉన్నారు.

ఆధ్యాత్మిక వారసత్వాన్ని భావి తరాలకు అందిద్దాం

- ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



రాఘవేందర్ రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కల్వకుర్తి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మిక వారసత్వాన్ని భావి తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఐక్యత ఫౌండేషన్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని లింగసానిపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న శివాలయం, రామలయాలను ఆయన సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు, దేవాలయ కమిటీ సభ్యులు ఆయనకు స్వాగతం పలికారు. ఆయన మాట్లా డుతూ సమాజంలో భక్తిబావం శాంతిని పెంచే గొప్పమార్గం దైవభక్తినన్నారు. ఆలయాల నిర్మాణాలతో సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవ చ్చన్నారు. ఆలయ నిర్మాణానికి తనవంతు సహకారం ఉంటుందన్నారు. ఆలయ కమిటీ సభ్యులు రాములు, శేఖర్‌రెడ్డి, వినోద్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, నాగరాజు, సత్యం, శ్రీనివాస చారి, మల్లయ్య, మణెమ్మ పాల్గొన్నారు.

పాలెం విద్యార్థికి పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్



విద్యార్థినిని సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాములు

బిజినేపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పీహెచ్‌డీ ఎంట్రెన్స్ టెస్టులో పాలెంలోని ఎస్వీ డిగ్రీ అండ్ పీజీ అటానమస్ కళాశాల పూర్వ విద్యార్థిని ఎస్.పవిత్ర స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిందని శనివారం కళాశాల ప్రిన్సిపాల్ పి.రాములు తెలిపారు. పాలెం కళాశాలలో బీఏ తెగులు చదివిన పవిత్ర రెండేళ్ల క్రితం పీజీ ఎంట్రెన్స్‌లో స్టేట్ పస్ట్ ర్యాంక్ సాధించి సెంట్రల్ యూనివర్సిటీలో ఎంఏ తెలుగు లిటరేచర్ పూర్తి చేసింది. హెచ్‌సీయూ పీహెచ్‌డీ ఎంట్రెన్స్‌లో ఫస్ట్ ర్యాంకు సాధించడంతో ప్రిన్సిపాల్‌తో పాటు కళాశాల అధ్యాపక బృందం శాలువాతో సన్మానించి అభినందించారు. అలాగే కళాశాలకు చెందిన మరో పూర్వ విద్యార్థి బి.పరమేష్ పీహెచ్‌డీ ఎంట్రెన్స్‌లో స్టేట్ 6వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. విద్యార్థినిని అభినందించిన వారిలో లైబ్రేరియన్ డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ సుష్మ, డాక్టర్ నాగరాజు, శివ, డాక్టర్ రాధాకుమార్, డాక్టర్ స్వప్న, రవికుమార్, రమేష్, మనోజ్, ప్రకాష్‌బాబు, యాదగిరి మహేశ్వర్, కవిత, అక్బర్, కురుమయ్య, బాలస్వామి, నగేష్ ఉన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు



తాడూరు బస్టాండ్ సెంటర్‌లో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

తాడూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో శనివారం అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బస్టాండ్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. పర్వతాలు మాట్లాడుతూ గ్రామాల్లో గతంలో చేసిన సర్వేల ఆధారంగా ఉన్న పేదవాళ్లను గుర్తించాలని అన్నారు. అదేవిధంగా ఇంటి స్థలాలు లేకుండా ఇల్లు కట్టుకోలేని వారికి ప్రభుత్వం ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి అంతటి కాశన్న, కమిటీ సభ్యులు కాశన్న, శ్యాం సుందర్, వెంకటస్వామి, శంకర్, వెంకటయ్య, ఆంజనేయులు, కృష్ణయ్య పాల్గొన్నారు.